# ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కఠినతరం చేయాలి



## ప్రమాదాల తగ్గింపునకు రాష్ట్రస్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ నిరంతర తనిఖీలు చేపట్టాలి

### రవాణా శాఖ అధికారుల సమీక్షలో మంత్రి పొన్నం

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** రవాణా శాఖలో ఎన్‌ఫోర్స్ మెంట్‌ను మరింత కఠినతరం చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ఎన్‌ఫోర్స్ మెంట్ కోసం కొత్తగా ఏర్పడిన 33 జిల్లా స్థాయి బృందాలు, 3 రాష్ట్ర స్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ నిరంతర తనిఖీలు చేపట్టాలన్నారు. మైనింగ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ వాహనాల్లో ఓవర్ లోడ్ కాకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి కొద్ది రోజులుగా రవాణా శాఖ అమలు చేస్తున్న సంస్కరణలపై మరింత కఠిన తరం చేసేలా రవాణా శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించి మరణాల రేటును నివారించే విధంగా అధికారులు పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఇటీవల రవాణా శాఖలో 33 జిల్లా స్థాయి బృందాలు, మూడు రాష్ట్రస్థాయి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసిందని.. అందులో డిటిసి, ఆర్టిఏ ఇతర అధికారులు నిరంతరం తనిఖీలు చేపడుతున్నారు. తనిఖీలు ఏ బృందం ఎక్కడ చేపడుతుంది అనేదానిపై ముందస్తు సమాచారం లేకుండా ప్రతి రోజు ఉదయం 6 గంటలకి ఆయా బృందాలకు సమాచారం అందించి తనిఖీలు చేపట్టింది. గత 10 రోజుల వ్యవధిలో తనిఖీలు చేపట్టడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపైన 4748 కేసులు నమోదు చేయబడ్డాయి. మొత్తం 3420 వాహనాలు సీజ్ చేయబడ్డాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్ఫోర్స్మెంట్ బృందాలు మరింత తనిఖీలు ముమ్మరం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు ఓవర్ లోడ్ వల్లే అధికంగా జరుగుతుండడంతో దాని మీద ఎక్కువగా దృష్టి సారించారు. ఓవర్ లోడ్ అయిన వాహనాలు సీజ్ చేయడంతో పాటు, రెండోసారి ఓవర్ లోడ్ తో వాహనం పట్టుబడితే ఆ వాహనం పర్మిట్ రద్దు చేయడంతో పాటు, వాహనం నడుపుతున్న డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కూడా రద్దు చేసేలా చర్యలు తీసుకోనున్నారు. ఓవర్ లోడ్‌పై మైనింగ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ఎక్కడైతే వాహనాల లోడింగ్ జరుగుతుందో అక్కడే నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హెవీ వెహికల్ డ్రైవర్‌కి లైసెన్సు రెన్యువల్ సమయంలో పునఃశ్చరణ తరగతులు ఏర్పాటు చేసేలా కార్యాచరణ తీసుకోవాలని మంత్రి సూచించారు. గత సంవత్సరం నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవం మంచి ఫలితాలు ఇచ్చిందని ఈ సారి జనవరిలో జరిగే రోడ్డు భద్రత మాసోత్సవాలపై ఇప్పటినుంచే కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో విద్యార్థులు, డ్రైవర్లు, కార్మికులు, పోలీసులు, అధికారులు భాగస్వామ్యం ఉండేలా ఇప్పటి నుండి అవగాహన కల్పించాలన్నారు. పాఠశాల నుండి కాలేజీ వరకు వ్యాసరచన పోటీలు, రోడ్డు నిబంధన పై నాటకాలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఇందులో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉండేలా చేసి ప్రమాదాలు తగ్గించి మరణాల రేటు నివారించేలా కార్యాచరణ తీసుకోవాలని రవాణాశాఖ అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. రవాణా శాఖలో పెండింగ్ లో ఉన్న ఖాళీల భర్తీ చేయడంతో పాటు , ప్రమోషన్లు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు రమేష్, చంద్రశేఖర్ గౌడ్, శివ లింగయ్య పాల్గొన్నారు.




అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలు

# అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలకు నోటీసులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 21, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లోని హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియో, రామానాయుడు స్టూడియోలకు జీహెచ్ఎంసి అధికారులు నోటీసులు జారీ చేశారు. పూర్తిస్థాయిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలంటూ అధికారులు ఈ నోటీసులు అందించారు. ఈ రెండు స్టూడియోలు ట్రేడ్ లైసెన్స్ ఫీజు తక్కువ చెల్లిస్తున్నట్లు జీహెచ్ఎంసీ గుర్తించింది. హీరో అక్కినేని నాగార్జునకు చెందిన అన్నపూర్ణ స్టూడియోస్‌కు చెందిన ట్రేడ్ లైసెన్స్ వివరాలను పరిశీలించగా కేవలం రూ.49వేలు ఫీజు చెల్లిస్తున్నట్లు తేలింది. అన్నపూర్ణ స్టూడియోస్ విస్తీర్ణాన్ని పరిశీలించగా 1.92లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వ్యాపారం చేస్తుండగా కేవలం 8100 చదరపు అడుగులకే ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లిస్తున్నారని తేలింది. దీంతో 1.92లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలోని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ ఫీజుగా రూ.11.52లక్షలు చెల్లించాలంటూ జీహెచ్ ఎంసీ సర్కిల్-18 డీఎంసీ సమ్మయ్య నోటీసులు అందించారు. జూబ్లీ హిల్స్‌లోని రామానాయుడు స్టూడియో 68,270 చదరపు అడుగుల విస్తీర్ణం లో వ్యాపారం చేస్తుండగా కేవలం 1900 చదరపు అడుగుల విస్తీర్ణంలోనే వ్యాపారం చేస్తున్నామంటూ యేటా రూ.7600 ట్రేడ్ లైసెన్స్ ఫీజుగా చెల్లి స్తున్నారని తేలింది. దీంతో రూ. 2.73 లక్షల ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాలంటూ రామానాయుడు స్టూడియోస్ నిర్వాహకులైన సురేష్ ప్రొడక్షన్స్ సంస్థకు నోటీసులు అందజేశారు. డబ్బులు చెల్లించాలంటూ ఆయా సంస్థలకు నోటీసులు ఇచ్చామని సమ్మయ్య వివరించారు. గతంలోనూ ట్రేడ్ లైసెన్సులు లేని వాటిని సీజ్ చేసినట్లు ఆయన వివరించారు.



సిఎం ప్రజావాణిలో దివ్యాంగ బాలిక నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ జి.చిన్నారెడ్డి.

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 243

**హైదరాబాద్ (బేగంపేట), నవంబరు 21, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 243దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 30దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 82 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 56దరఖాస్తులు అంది నట్లు అధికారులు తెలియజేసారు. సీఎం ప్రజావాణీ ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా. జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికా రులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల అధికారులు సీఎం ప్రజావాణీని సందర్శించారు.

# ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా నికర జలాల్లో 512 టిఎంసిలు ఇవ్వాల్సిందే

## ఒక్క టిఎంసి తగ్గినా ఆ రాష్ట్రానికి మరణశాసనం

### ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబుకు జగన్ లేఖ

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** బచావత్ ట్రిబ్యునల్ కేటాయించిన 512 టిఎంసి ల నికర నీటిలో ఒక్క టిఎంసి తగ్గినా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత వైఎస్ జగన్ హెచ్చరించారు. తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్‌పాటిల్‌తో సమావేశమై సానుకూలమైన హామీతో చేయన తిరిగిరావడంతో వైఎస్‌జగన్ ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల పరిరక్షకు ముఖ్యమంత్రికి ఈనెల 19న లేఖరాస్తూ సలహా ఇచ్చారు. కెడబ్ల్యు బిటి -2 ఎదుట జరగబోయే వాదనల్లో రాష్ట్ర ప్రయోజనాలను సమర్థవంతంగా వినిపించాలని కోరారు. పొరపాటు జరిగితే ఆంధ్రప్రదేశ్ రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి కృష్ణా నదిలో 763 టిఎంసిలను కేటాయించేందుకు ట్రిబ్యునల్ అంగీకరిస్తే ఎపికు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రైతుల ప్రయోజనాలను అనుగుణంగా ప్రభుత్వం తమ వాదనలు వినిపించాలి రాయలసీమ ప్రాజెక్టులపై టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తోంది. 1996లో చంద్రబాబు ఎపి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అల్మట్టి ప్రాజెక్టు ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.25 మీటర్లకు పెంచే పనులు ప్రారంభ మయ్యాయి. ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిపక్షాలు, రైతులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అల్మట్టి ఎత్తు పెంపు వలన ఎపి హక్కులకు ముప్పు ఏర్పడుతుంది. దీనిపై అప్పట్లో ఎన్ని ఆందోళనలు చేసినా చంద్రబాబు పట్టించుకోలేదు. ప్రజాభిప్రాయాన్ని రైతుల ఆందోళనలను ఖాతరు చేయలేదు. టిడిపి ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగానే బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అల్మట్టి ఎత్తు పెంపునకు అనుమతి ఇచ్చింది. అంతేకాదు. 2014లో ఏర్పడిన టిడిపి ప్రభుత్వం కృష్ణా నదిపై ఏపీ హక్కులను తెలంగాణకు పూర్తిగా వది లేసిందని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు సిఎంగా ఉన్న తరుణంలోనే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ క్లిష్ట పరిస్థితిలో టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్ర హక్కులను సమర్థంగా కాపాడాలని కోరారు.




అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టిన వామపక్ష పార్టీల నేతలు

# బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలి

### సిపిఐ నేత కూనంనేని సాంబశివరావు వినతి

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 21, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మనుషులను ఊచకోత కోస్తుంటే సుప్రీం కోర్టు మౌనంగా ఉండటం విచారకరమని, తక్షణమే బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ వ్యవస్థ సుమోటోగా స్వీకరించి సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. కేంద్రం తక్షణమే బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపడతామని చెప్పారు. మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం బూట కపు ఎన్‌కౌంటర్ల ద్వారా చంపడాన్ని ఖండిస్తూ బూటకపు ఎన్‌కౌంటర్ల వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో వామపక్ష రాజకీయ పార్టీలు, మేథావులు, ప్రజా సంఘాలు, పౌర హక్కుల ప్రతినిధులు శుక్రవారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ వచ్చే యేడాది మార్చి నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని అమిత్ షా ప్రకటించారని, దీనికి ముందుగా దేశంలో ఉన్న అవినీతిని, నిరుద్యోగాన్ని, పాకిస్తాన్ తీవ్రవాదాన్ని అంతం చేస్తామని సవాల్‌గా తీసుకోవాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై ప్రశ్నించినందుకు తనపైన బిజెపి, ఆర్ఎస్ఎస్ అనుకూల సోషల్ మీడియాలో స్పందిస్తూ తనని కూడా చంపాలని పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు.

# టెట్ నుంచి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి

### చట్టసవరణ చేయాలి.. ఎంపిలకు తపస్ విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నుంచి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్ల మెంట్ సభ్యుల(ఎంపి)కు వినతిపత్రం సమర్పించినట్టు సంఘం అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ తెలిపారు. ఇదే అంశంపై ఇప్పటికే ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ఆగస్టు 23, 2010లో ఎన్‌సిటిఈ జారీ చేసిన నోటిఫికేషన్‌లో ఆగస్టు 23, 2010 కన్న ముందు సెలక్ట్ అయిన వారికి టెట్ మినాయింపు ఉందని స్పష్టంగా పెర్కొన్నారని గుర్తు చేశారు. కాబట్టి సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేసి న్యాయ నిపుణుల సలహాలతో సమస్య పరిష్కరించాలని ఎంపిలను కోరినట్టు తెలిపారు. డిసెంబరు 1 నుంచి 19 వరకు జరగబోయే పార్లమెంట్ సమా వేశంలో చర్చించి చట్ట సవరణ చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న పార్ల మెంట్ సభ్యులకు వారి నియోజకవర్గాల్లో నేటి(శనివారం) నుంచి 28 వరకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్టు వారు తెలిపారు.


# ఎఫ్‌ఆర్ఎస్ సమర్థ అమలుపై ఇంటర్‌బోర్డు కార్యదర్శికి ప్రశంసలు

### కమాండ్ కంట్రోల్‌తోపాటు సిసిటివి నిఘా వ్యవస్థ పనితీరును పరిశీలించిన సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** ఇంటర్ బోర్డులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలులో ఉన్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థి కేంద్రిత చర్యలను సమీక్షించారు. కమాండ్ కంట్రోల్ రూము పరిశీలించి, రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ నిఘా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. రాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను పర్యవేక్షించి, విద్యార్థుల హాజరు, విద్యా పురోగతి వంటి అంశాలపై ఇంటర్ బోర్డు అధికారులతో అజిత్ రెడ్డి చర్చించారు. విద్యార్థులు, సిబ్బంది హాజరును రియల్‌టైమ్ నమోదు చేసే ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్)ను సమర్థంగా అమలు చేస్తున్నందుకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్యను ఆయన ప్రశంసించారు. ఈ వ్యవస్థ ద్వారా హాజరు శాతం పెరగడంతో పాటు సిబ్బంది వినియోగం, కళాశాలల నిర్వహణలో పారదర్శకత మెరుగు పడిందని తెలిపారు. అలాగే సీసీటీవీ నిఘా విద్యార్థుల భద్రత, క్రమశిక్షణ, విద్యా వాతావరణాన్ని బలోపేతం చేస్తున్నట్లు ఆయన అభిప్రాయపడ్డారు. ఇంటరాక్టివ్ వాయిస్ రిస్పాన్స్ సిస్టమ్ (ఐవిఆర్ఎస్)ను కూడా సమీక్షించి, విద్యార్థుల ఫిర్యాదులకు త్వరితగతిన స్పందిస్తున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగుల సెలవుల నిర్వహణ, సేవా సంబంధిత కార్యాచరణలను సులభతరం చేస్తున్న హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్ సిస్టమ్ (హెచ్ఆర్ఎంఎస్) పోర్టల్ అమలును కూడా ఆయన అభినందించారు. ఈ పోర్టల్ వల్ల మానవ జోక్యం తగ్గి, ప్రక్రియలు వేగవంతం అవడంతోపాటు సిబ్బంది పాలనలో పారదర్శకత పెరిగిందని పేర్కొ న్నారు. 2026 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇంటర్‌బోర్డు కార్య దర్శి కృష్ణ ఆదిత్య.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఇంటర్ విద్యాశాఖ పలు చర్యలను చేపట్టిందని తెలిపారు.

# మత్స్య కార్మిక కుటుంబాల ఆర్థిక ఉన్నతికి ప్రభుత్వం కృషి: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** మత్స్య కార్మిక కుటుంబాల ఆర్థిక ఉన్నతికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవం సందర్భంగా మత్స్య కారులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాని టిపిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష కుమార్ గౌడ్ తెలిపారు. జీవనాధారంగా మత్స్య వృత్తిని ఆశ్రయించి కష్టపడుతున్న గంగపుత్రులు, బెస్తలు, గుండ్లలు, ముదిరాజ్‌లు రైతుల వలే వారు కూడా ప్రజలకు ఆహారం అందించడానికి నీటివనరులలో ప్రమాదకరమైన పరిస్థితిలో చేపలవేట చేస్తారని అన్నారు. మత్స్యకారుల కష్టాన్ని గౌరవించాలనే ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అనేక పథకాలు రూపొందించిందని ఆయన తెలిపారు. పేద కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో చేపల పెంపకం, చేప పిల్లల పంపిణీ కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఈ రంగంలో నూతన సాంకేతికత, మౌలిక వసతులు, మార్కెట్ అవకాశాలు కల్పిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని అభిప్రాయ పడ్డారు. ప్రపంచ మత్స్య కార్మిక దినోత్సవం వేడుకల సందర్భంగా వృత్తిపై ఆధారపడిన ప్రతి మత్స్య కుటుంబం మంచి జీవన ప్రమాణాలు సాధించాలని ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చేలా బిసి ఉద్యమం

### రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ జరగాలి: జెఏసి సమావేశంలో వక్తలు

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ జరిగే వరకు ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశంలో పలువురు వక్తలు హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడ లోని అభినందన్ గ్రాండ్లో తెలంగాణ బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బీసీ సంఘాలు, మేధావులు, విద్యావంతులు, ఉద్యోగులు, విద్యార్థి, యువజన, మహిళా, సామాజిక ఉద్యమకారుల సమావేశానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, మధుయాస్కీగౌడ్, జస్టిస్ చంద్రకుమార్, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస గౌడ్, వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, తదితరులు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చేలా జేఏసీ ఉద్యమం ఉంటుందని అన్నారు. ఈ నెల 25వ తేదీన దిష్టిబొమ్మల దహనం, 30న బీసీల యుద్ధభేరి, 9న పార్లమెంట్ ముట్టడి చేపట్టనున్నట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. రాజ్యాంగ సవరణ ద్వారానే బీసీ రిజర్వేషన్లు సాధ్యపడుతుందని, ఆ దిశగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ చొరవ తీసుకుంటారని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సూచించారు. ఈ సందర్భంగా నూతనంగా బీసీ జేఏసీని ఏర్పాటు చేశారు. జేఏసీ చైర్మన్‌గా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కో చైర్మన్ గా కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. రిజర్వేషన్లు సాధించుకోవడానికి ఢిల్లీ స్థాయిలో ఉద్యమం చేపట్టాలని ఏఐసీసీ నేత రాహుల్ గాంధీని కలిసి పార్లమెంట్ ప్రవేట్ బిల్లు పెట్టిస్తేనే బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరు గౌరీశంకర్, సర్దార్ పుట్టం పురుషోత్తం రావు, సినీ నిర్మాత శంకర్, ప్రొఫెసర్ భాగయ్య, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రమ్ గౌడ్, నిరంజన్, శేఖర్, సాగర్, మణిమంజరి, జొర్రిగల శ్రీనివాస్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌టిసి డ్రైవర్, కండక్టర్లపై దాడులను నివారించాలి

## ప్రభుత్వం, యాజమాన్యానికి ఎంప్లాయీస్ యూనియన్ విజ్ఞప్తి

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** ఆర్‌టిసిలో పనిచేస్తున్న డ్రైవర్ కండక్టర్లపై విధి నిర్వహణలో జరుగుతున్న దాడులను అరికట్టేలా చూడాలని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. దాడుల మూలంగా డ్రైవర్లు, కండక్టర్లు డ్యూటీ చేయాలంటేనే భయభ్రాంతులకు గురవుతున్నారని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఈదురు వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికులతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, కొన్ని సందర్భాల్లో తీవ్రమైన వాగ్వివాదాలు జరిగి మహి ళలు డ్రైవర్, కండక్టర్లపై చేయి చేసుకోవడం కూడా జరుగుతున్నాయని.. ఇంకా అక్కడక్కడ జరుగుతూనే ఉన్నాయన్నారు. బస్సులో టికెట్ తీసుకుని ప్రయా ణిస్తున్న పురుష ప్రయాణికులు తమకు సీట్ లేదన్న కారణంగా డ్రైవర్, కండక్టర్లను దూషిస్తున్నారని, మరికొందరు ప్రయాణికులు స్టేజి లేకపోయినా తాము ఆపమన్నచోట బస్సులు ఆపలేదని డ్రైవర్, కండక్టర్లపై దాడికి దిగుతున్నార న్నారు. రోడ్డుమీద వెళుతున్న వాహనదారులు కూడా తమకు సైడ్ ఇవ్వలేదన్న కారణంగా బస్సును ఆపి మరీ సిబ్బందిపై దాడి చేసి విచక్షణా రహితంగా దాడి చేస్తున్నారని వెంకన్న ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బందిపై దాడి చేయడం మూలంగా కొందరు సిబ్బంది గాయాల ప్రభావం వల్ల మెడికల్ అన్‌ఫిట్ అవడం కూడా జరిగిందని గుర్తుచేశారు. డ్రైవర్, కండక్టర్లు చెకింగ్ అధికారులతో ఎటువంటి ఇబ్బందులు వస్తాయో అనుకుంటూ భయం భయంగా ఉద్యోగం చేస్తుంటే.. అదనంగా పులిమీద పుట్ర లాగా ప్రయాణికుల దాడులతో మరింత అభద్రతా భావానికి లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి యాజమాన్యం సిబ్బందికి విధి నిర్వహణలో ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేస్తుందన్నారు. కమిషనర్ ఆఫ్ పోలీస్, హైదరాబాద్ విసి సజ్జనార్ దాడులు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, హిస్టరీ షీట్లు తెరుస్తామని హెచ్చరించటాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

# ప్రభుత్వాలను అవమానించేలా న్యాయవ్యవస్థ తీర్పులు

### సిపిఐ జాతీయ నాయకుడు నారాయణ

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** ఇటీవల కాలంలో న్యాయవ్యవస్థలు ఇస్తున్న తీర్పుల మూలంగా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను అవ మానించేలా ఉంటున్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) జాతీయ నాయకుడు కె నారాయణ విమర్శించారు. మన వ్యవస్థలోని అతి ముఖ్యమైన సంస్థాగత స్తంభాలలో ఉన్నత న్యాయవ్యవస్థ ఒకటన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ సంస్థ కూడా ముప్పును ఎదుర్కొంటుందన్నారు. ప్రజాస్వామ్య సూత్రాల ప్రకారం, ప్రజలచే నేరుగా ఎన్నుకోబడిన ప్రభుత్వాలను గౌరవించాలని.. కానీ ఇటీవల ఉన్నత న్యాయవ్యవస్థ ఇచ్చిన తీర్పులు ప్రజా స్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను అవమానించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. మన ప్రజాస్వామ్య వ్యవస్థపై చీకటిరోజులు వచ్చాయన్నారు.

# కెటిఆర్ ఇష్టారీతిన మాట్లాడటం ఆరోపణలకు సమాధానం కాదు: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** ఒక ఐఎఎస్ అధికారిని విచారణకు పిలవాలంటే డిఒపిటి నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని రాష్ట్రప్రభుత్వం ఇవన్నీ తీసుకొనే చట్ట ప్రకారం ముందుకు వెళ్తోందని కెటిఆర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే అదీ ఆరోపణలకు సమాధానం కాదని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ "కెటిఆర్ నీపై వచ్చిన ఆరోపణలపై




మాట్లాడాలే కానీ విషయాన్ని తప్పుదోవ పట్టించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై ఆరోపణలు చేస్తేసరికాదని హితవు చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికలో కాంగ్రెస్ ఏంటో, బిఆర్ఎస్ ఏంటో తేలిపోతుందనీ, కారుకు బుల్డోజర్ కు మధ్య పోటీ అనీ ఏదో ఏదో మాట్లాడావు ఏమైందనీ ఆయన ప్రశ్నించారు. కారును జూబ్లీహిల్స్ ప్రజలు బండకేసి కొట్టలేదా అని ఆయన గుర్తుచేశారు. ఏలాంటి బెరుకు లేకుండా ఏదో ఏదో మాట్లాడుతున్నావనీ విమర్శించారు. లై డిటెక్టర్ పరీక్షలు అని మాట్లాడుతున్నావు, దమ్ముంటే నీపై వచ్చిన ఆరోపణలపై ప్రెస్ మీట్ పెట్టి క్లారిటీ ఇవ్వు అని కోరారు. అలా కాని పక్షంలో ఆనాడు మంత్రిగా అన్ని నేనే చేశాను, నేనే చెబితేనే అధికారులు చేశారని ఒప్పుకో అని ఆయన అన్నారు. ఎసిబి విచారణలో ఓ మాట, బయట పబ్లిక్ లో ఓ మాట మాట్లాడితే ఎలా ? ప్రజలంతా గమనిస్తున్నారని ఆయన అన్నారు.. కవిత చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కెటిఆర్, హరీష్ రావుపై ఉంది అని అన్నారు. తీరు మార్చుకోకపోతే జూబ్లీహిల్స్ లో డిపాజిట్ అయినా వచ్చింది, రానున్న ఎన్నికల్లో అయింత డిపాజిట్ కూడా వచ్చే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు.

# బిసిలకు పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లంటే అంగీకరించం

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (నాంపల్లి), నవంబరు 21, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం మాటమార్చి పార్టీపరంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటే అంగీకరించబోమని, పెద్దయెత్తున ఆందోళ చేస్తామని రాజ్యసభ సభ్యుడు జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. స్థానిక సంస్థలలో బిసిలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌చేస్తూ బిసి నాయకులు పగిళ్ల సతీష్, నీలా వెంకటేష్ నాయకత్వంలో శుక్రవారం వేలాది మంది బిసి విద్యార్థుల హైదరాబాద్ కలెక్టరేట్ ముట్టడి భారీ ప్రదర్శనను ఉద్దేశించి ఆర్. కృష్ణయ్య మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి6 ప్రకారం స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగ అధికార మిచ్చింది కాబట్టి అసెంబ్లీలో చట్టం చేశారు. న్యాయపరమైన సమస్య లు వస్తే సుప్రీంకోర్టుకు, లేదా ఏ కోర్టుకు ఎవరైనా వెళ్లినా చట్టప్రకారం, న్యాయ ప్రకారం రాజ్యాంగపరమైన అవ రోధాలు లేవు కనుక బిసిలు కేసుగెలిచే అవకాశ ముందని స్పష్టం చేశారు. జనాభా ప్రాతిపదిక విద్య, ఉద్యోగ రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థల రిజర్వేషన్లకు కల్పించే సమస్యకు శాశ్వత పరిష్కారానికి రాజ్యాంగ సవరణ జరగాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బిసిల రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ బంద్‌కు అన్ని రాజకీయపార్టీలు మద్దతు ఇచ్చినట్లు రాజ్యాంగ సవరణకు కూడా అలాగే సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ బద్ధత కల్పించడమే బిసి రిజర్వేసన్లకు శాశ్వత పరిష్కారమని కృష్ణయ్య స్పష్టం చేశారు. ఈ ముట్టడి కార్యక్రమంలో బిసి నాయకులు జి.అనంతయ్య, రాజ్‌కుమార్, రాజేందర్, శివ కుమార్ యాదవ్, వీరన్న, నిఖిల్, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరిన ఆర్.కృష్ణయ్య, పి.సతీష్, ఎన్.వెంకటేష్ తదితర నాయకులు, బిసి విద్యార్థులు



## చుక్కా రామయ్యకు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 21:** తెలంగాణకు చెందిన ప్రముఖ విద్యావేత్త, మాజీ శాసనమండలి సభ్యుడు చుక్కా రామయ్య 100వ పుట్టిన రోజు సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయన స్వగృహంలో కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ క్రమంలో శుక్రవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ కార్యదర్శి డా. నరసింహ చార్యులు ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్‌తో కడియం శ్రీహరి భేటీ

### రాజీనామాకు సిద్ధమైన దానం నాగేందర్?

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 21:** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై తక్షణమే వివరణ ఇవ్వాలని కోరుతూ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గురువారం మరోసారి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఆయన నివాసంలో కడియం శ్రీహరి కలిశారు. ఈ నెల 23వ తేదీ లోపు ఫిరాయింపు ఆరోపణలపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పీకర్ పేర్కొన్నారు. దీంతో వివరణ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని స్పీకర్‌ను కడియం శ్రీహరి కోరారు. ఈ మేరకు స్పీకర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఢిల్లీ నుండి రాగానే స్పీకర్‌ను దానం నాగేందర్ కలవనున్నారు. దానం నాగేందర్ మరింత సమయం కోరుతాడా లేదా రాజీనామా చేస్తాడా అనే అంశంపై సందిగ్ధత నెలకొంది. ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, ఆ తర్వాత మంత్రివర్గంలో చేరుతారని ప్రచారం జరుగుతుంది. మంత్రిగా ఉండి ఉపఎన్నికల్లో గెలవాలని యోచన చేస్తున్నారని ప్రచారం. గత ఆగస్టులో ఫిర్యాదులొచ్చిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. వారిలో దానం, కడియం మినహా మిగిలిన 8 మంది తమ సమాధానాలను అఫిడవిట్ రూపంలో అసెంబ్లీ కార్యదర్శికి దాఖలు చేయడంతో పాటు ఇటీవల వరకు స్పీకర్ వద్ద విచారణకు హాజరయ్యారు.

## ఖజానాకు రూ.1,45,124 కోట్ల రాబడి

### పన్నుల ద్వారా రూ.16,372 కోట్లు రాక

### వ్యయం రూ.1,33,920 కోట్లు


**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త :** తెలంగాణ సర్కారు ఖజానాకు భారీగా పన్నుల ఆదాయం సమకూరింది. రెవెన్యూ, మూలధన రాబడులన్నింటి కింద ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.2,84,837.29 కోట్లు సమకూరుతాయని వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రకటించగా అక్టోబరు నెల నాటికి అంటే ఏడు నెలల్లో రూ.1,45,124.52 కోట్లు సమకూరాయి. అలాగే మొత్తంగా ప్రభుత్వం రూ.1,33,920.93 కోట్లు ఖర్చు చేసింది. కాగ్ విడుదల చేసిన రాష్ట్ర ఆదాయ, వ్యయాలకు సంబంధించి అక్టోబరునెల నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. అంచనా వ్యయం రూ.2,63,486కోట్లలో ఇది 50.83 శాతం. రాష్ట్ర ఎక్సైజ్ సుంకాల కింద ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.27,623.36 కోట్లు వస్తాయని ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో అంచనా వేసింది. ఇందులో అక్టోబరు నాటికి 48.14 శాతం మేర రూ.13,296.75 కోట్లు వచ్చాయి. ప్రతి నెలా దాదాపు రూ.2,000 కోట్ల పైబలుకు ఎక్సైజ్ రాబడి సమకూరుతుంది. జీఎస్టీ, ఎక్సైజ్ సుంకాలు, అమ్మకం పన్ను, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఇతర పన్నులు, సుంకాలు, కేంద్ర పన్నుల్లో వాటా వంటి అన్ని రకాల పన్ను రాబడి కింద గత రోలలో రూ.16,372.44 కోట్లు వచ్చాయి. ఈ పన్నుల కింద సెప్టెంబరు నెలలో రూ.71,836.66 కోట్లు రాగా అది అక్టోబరు కల్లా రూ.88,209.10 కోట్లకు పెరిగాయి. ఈ ఆర్థిక సంవత్సరం పన్నుల కింద మొత్తం రూ.1,75,319.35 కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేయగా ఏడు నెలల కాలానికి 50.31 శాతం చొప్పున రూ.88,209.10 కోట్లు రాబడి చోటు చేసుకుంది. ఇక మార్కెట్ నుంచి రూ.54,009.74 కోట్ల అప్పులు తీసుకోనున్నట్లు ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొనగా, 93.58 శాతం చొప్పున రూ.50,541.22 కోట్ల మేర రుణాలను సేకరించింది. ఇక వ్యయానికి వచ్చేసరికి వివిధ పథకాలకు రూ.40,175.66 కోట్లు, వడ్డీ చెల్లింపులకు రూ.16,529.88 కోట్లు, ఉద్యోగుల జీతాలకు రూ.27,663కోట్లు ఖర్చు చేసింది.

## రూ.వెయ్యికోట్లకుపైగా సైబర్ క్రైమ్ కట్టడి

### 700 మంది సైబర్‌క్రిమినల్స్ ఆటకట్టించిన ఢిల్లీ పోలీస్

### ఒక మహిళ సహా ఎనిమిది మంది అరెస్టు

**న్యూఢిల్లీ, నవంబరు 21:** ఢిల్లీపోలీసులు నిర్వహించిన జాయింట్ ఆపరేషన్‌లో ఏకంగా వెయ్యికోట్లకుపైబడిన మోసాలను వెలుగులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా700 మంది నేరగాళ్ల ఆటపట్టించారు. ఈ ఏడాదిలో ఢిల్లీలో అతిపెద్ద సైబర్ క్రైమ్ ఇదేనని చెప్పుకోవచ్చు. జిల్లాపోలీస్ యూనిట్లు, రాష్ట్ర యూనిట్లు, ఢిల్లీలోని నిఘా వ్యూహాత్మక ఆపరేషన్స్ యూనిట్ సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించింది. సైబర్ హాక్ కోడ్‌నేమ్‌తో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో సైబర్ నేరగాళ్ల అడ్డాలను ఛేదించింది. మోసం, ఫేక్ కస్టమర్‌కేర్ కుంభకోణాలు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, డిజిటల్‌పేమెంట్ చోరీలు వంటివి మరెన్నో బయటపడ్డాయి. అనుమానాస్పదమైన, మోసపూరిత లావాదేవీలు 1000 కోట్ల రూపాయలకు ఎైబడి జరిగిందని వెల్లడించారు. ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో డిజిటల్‌పరికరాలను రికవరీచేసి బోగస్ పత్రాలు, ఫోర్జరీ పత్రాలను భారీ సంఖ్యలో స్వాధీనంచేసుకున్నారు. బాధితుల సొమ్మును మ్యూల్‌ఖాతాల్లోకి మళ్లించి సొమ్ముచేసుకుంటున్నట్లు కూడా గుర్తించారు. లేదా ఇతర బానయంకు ఖాతాలకు మళ్లించి సొమ్ము విత్‌డ్రా చేస్తున్నారు.



## రేవంత్‌రెడ్డి కుటుంబాన్ని బ్లేమ్ చేయడం తప్ప

### కెటిఆర్‌కు మరో పనిలేదు: ఎంపి చామల

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** రేవంత్ రెడ్డి కుటుంబాన్ని బ్లేమ్ చేయడం తప్ప కెటిఆర్‌కు మరో పనిలేదని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్ ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ పచ్చ కామెర్లు వచ్చిన వారికి లోకం అంతా పచ్చగానే కనపడుతుందని మేం ప్రజాస్వామ్యయుతంగా పాలిస్తున్నామని అన్నారు. బిఆర్ఎస్ ఫాం హౌస్ పాలన తప్ప ప్రజా పాలన చేయలేదని చెప్పారు. మా ప్రభుత్వం లో కేబినెట్ లో అన్ని నిర్ణయాలు జరుగుతాయని కెటిఆర్ ఒప్పుకున్నారని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి కుటుంబం లో ఎంతమంది లీడర్లు ఉన్నరు చెప్పు అని నిలదీశారు. మీలాగ ఇంట్లో ఉన్నోళ్ళందరికి రాజకీయ పదవులు లేవు కేటీఆర్ అని ఆయన తెలిపారు. కెటిఆర్ పదేళ్ల ఏం చేసాడు, పెట్టుబడులు ఏమయ్యాయి అని అడిగారు. మీరు మంచి చేయరు, మేము చేస్తుంటే అడ్డుకుంటున్నారని ఆయన అన్నారు.

# జోహాన్స్‌బర్గ్‌లో ప్రధాని మోడీ

## గ్వాటెంగ్ ఎయిర్‌బేస్‌లో సంప్రదాయ నృత్యాలతో స్వాగతం



**జోహాన్స్‌బర్గ్, నవంబరు 21:** జీ20 సమావేశాల్లో పాల్గొనేందుకు దక్షిణాఫ్రికా చేరుకున్న ప్రధానికి వాటర్ లూఫ్ ఎయిర్‌ఫోర్స్ బేస్ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. దక్షిణాఫ్రికా సాంప్రదాయాలను అనుసరించి ప్రధాని మోడీకి కళాకారులు గేయాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో స్వాగతం పలికారు. జీ20 సదస్సు ఈసారి దక్షిణాఫ్రికాలోజరుగుతోంది. ఆఫ్రికన్ కూటమి భారత్ ఛైర్మన్‌గిరీలోనే గత ఏడాది జీ20కూటమిలో చేరినసంగతి తెలిసిందే.

ఈ సదస్సు సందర్భంగానే ప్రధానిమోడీ జీ20 దేశాల అధిపతులతో ద్వైపాక్షిక సమావేశాలు కూడా నిర్వహించనున్నారు. అలాగే ఆరవ త్రైపాక్షిక ఫోరమ్ ఐబిఎస్ఎలో కూడా పాల్గొంటారు. భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలు సంయుక్తకూటమి ఐబిఎస్ఎగాపిలుస్తారు. ఆఫ్రికాలో జరుగుతున్న తొలి జీ20 సమావేశాల్లో పాల్గొనడం గర్వకారణంగా ఉందంటూ బయలుదేరే ముందు ప్రధానిమోడీ తన ఎక్స్‌లో పోస్టుచేసారు. వివిధ ప్రపంచస్థాయి అంశాలపై మాట్లాడటం, ఇతర దేశాధిపతులతో పరస్పర అభిప్రాయాలు సంప్రదింపులు జరిపేందుకు ఈ వేదిక తోడ్పడుతుందని ఆయన పోస్టులో పేర్కొన్నారు. సదస్సులో వసుదైవ కుటుంబ సిద్ధాంతాన్ని, ఒకే పుడమి ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు నినాదాన్ని సదస్సులో వినిపిస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న అనేక సవాళ్లపైచర్చించేందుకు ఈ జీ20 సదస్సు ఎంతో ఉపయోగపడుతుందని మోడీ పేర్కొన్నారు.

గతంలో న్యూఢిల్లీ, రియోడిజెనీరలోల్లో జరిగిన సదస్సుల్లో భేటీలు సంతృప్తికరమైన ఫలితాలి చ్చాయన్నారు. సుస్థిరత, సమానత్వం, సంఘీభావం నేటి సదస్సు ప్రధాన నినాదంగా నడుస్తుందని మోడీ తన పోస్టులో వివరించారు. ఆరవ ఐబిఎస్ఎ సదస్సుతోపాటు జీ20 దేశాధినేతలతో జరిగే ముఖాముఖీ భేటీకోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. సదస్సులో తొలిరోజు సుస్థిర ఆర్థికవృద్ధి, ఆర్థిక పటిష్టత, వాణిజ్యం, అభివృద్ధికి చేయూత, రుణభారం వంటి అంశాలపై చర్చలు జరుగుతాయి.

ప్రకృతి వైపరీత్యాల నష్టం తగ్గింపు, వాతావరణ మార్పులు, ఇంధనపరివర్తనం, ఆహార వ్యవస్థలు, సంక్లిష్ట ఖనిజవనరులు, కృత్రిమ మేధ, పని వాతావరణంలో స్వచ్ఛత వంటివి ఉంటాయని తెల్పారు. జీ20 సదసుసకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు హాజరుకావడంలేదు.

## ఆదిలాబాద్‌లో పత్తి, సోయా కొనుగోళ్ల కోసం ధర్నా

### భారీగా ట్రాఫిక్ జామ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 21:** ఆదిలాబాద్ జిల్లాలోని పత్తి, సోయాబిన్ కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. హైదరాబాద్-నాగపూర్ జాతీయ రహదారి 44 పై నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు భారీగా తరలివచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా జాతీయ రహదారిపై బైఠాయించిన రైతులు నిరసన తెలిపారు. పంటల కొనుగోలలో రెండు ప్రభుత్వాలు నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని నాయకులకు తెలిపారు. సీసీఐ తేమశాతం పేరిట పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర లభించక పోవడంతో మధ్య దళారులకు విక్రయించి పత్తి క్వింటాలుకు రూ.1500 చొప్పున నష్టపోతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు ఏడు క్వింటాళ్లు మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని, మిగిలిన పత్తిని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారని తెలిపారు. సోయాబీన్ కొనుగోలు సైతం పలు నిబంధనలు అమలు చేస్తున్నారని, వేలిముద్ర తప్పనిసరి చేయడంతో రైతులు పంటను అమ్ముకునే పరిస్థితి లేదని వాపోయారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న సోయాబిన్ పంటను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించిన నష్టపోతున్నారని తెలిపారు. పంటల కొనుగోలులో నిబంధనలు ఎత్తివేసే వరకు ఆందోళన నిర్వహించనునట్లు అఖిలపక్షం నాయకులు తెలిపారు. రైతుల ఆందోళన ఫలితంగా జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి.

## నన్ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్‌రెడ్డికి లేదు



### ఏ తప్పు చేయలేదు.. లైడిటెక్టర్ టెస్ట్‌కు రెడీ: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 21:** ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఏ1గా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తన ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతిపై కేటీఆర్ స్పందించారు. శుక్రవారం మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. చట్టం తన పని తాను చేసుకు పోతుందని.. చేసుకు పోనివ్వండన్నారు. ఫార్ములా ఈ రేసింగ్‌లో తాను ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై లై డిటెక్టర్ టెస్ట్‌కు కూడా తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి తెలంగాణలో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాయని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో జాయింట్ వెంచర్ ప్రభుత్వం నడుస్తోంద న్నారు. తాము మళ్ళీ ప్రభు త్వంలోకి వస్తామని, అన్ని లెక్కలు తేలుస్తామన్నారు. తనను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్ రెడ్డికి లేదని, అరెస్ట్ జరగదని ధీమా వ్యక్తం చేశారు. అందులో ఏమీ లేదని రేవంత్‌కు కూడా తెలుసన్నారు. దానం నాగేందర్‌తో రాజీనామా చేపించి, కడియంను కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ గుర్తుపై సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేసి దానం దొరికిపోయారన్నారు. అనర్హత వేటు పడితే ఇజ్జత్ పోతుందని రాజీనామా చూపిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. సాకేంతిక సాకులు చూపి కడియంను కాపాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నిక కంటే ముందే గ్రేటర్ ఎన్నికలొస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు.

## ట్రిబుల్‌ఆర్ రెండో విడత పరిహారంపై పైరవీకారుల హడావిడి

### ఎకరాకు గరిష్టంగా రూ.30 లక్షలు అందజేసే అవకాశం

### మెదక్ జిల్లాలో నేడు నాలుగు గ్రామాల రైతులతో కలెక్టర్ సమక్షంలో విచారణ

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** రీజినల్ రింగ్‌రోడ్ ఉత్తరభాగం నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు రెండో విడత పరిహారం అభిలషణీయస్థాయిలో ఉంటుందని తెలియడంతో పైరవీకారుల హడావిడి మొదలైంది. భూములు కోల్పోతున్న రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదని మధ్యవర్తులను పైరవీకారులను ఆశ్రయించ వద్దని అధికారులు చెబుతున్నా భూనిర్వాసితులు పైరవీకారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. మొదటి విడతలో భూముల పరిహారం ఆర్డీవో స్థాయిలో జరిగిన ఆర్బిట్రేషన్ అనుసరించి డబ్బులు జమచేస్తున్నారు. ప్రస్తుతం మొదటి విడుత ఎకరాకు 14 లక్షల నుంచి 15 లక్షల రూపాయల మేరకు జమ చేస్తున్నారు. రీజినల్ రింగ్‌రోడ్ అలైన్‌మెంట్ వెళ్ళుతున్న సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్ జగదేవ్‌పూర్, భువనగిరి, చౌటుప్పల్ పరిధిలో ఎంపిక చేసుకున్న గ్రామాలను ఎంపి చేసుకొని డబ్బులు జమచేస్తున్నారు.

నర్సాపూర్ మండలం నాగులపల్లిలో 26మంది రైతులకు రూ.61.18 లక్షలు, నర్సాపూర్ తిరుమలాపూర్‌లో తొమ్మిది మంది భూనిర్వాసితులకు రూ.20.51లక్షలు శివ్వంపేట గుండ్లపల్లి 12 మంది రైతులకు రూ.277లక్షలు, పాంబండ ముగ్గురు రైతులకు రూ.15.85లక్షలు మొదటి పరిహారం ప్రకటించారు. తొలివిడుత పరిహారం అరకొరగా ఉందని భావించిన నిర్వాసితులు చేసుకున్న విన్నపాలను స్పందించి అధికారులు గ్రామాలకు వెళ్ళి అర్బిట్రేషనన దరఖాస్తులు తీసుకొంటూన్నరు. కలెక్టర్ల వద్ద రెండో విడుత పరిహారం ఎకరాకు రూ.30లక్షలవరకు పెంచే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుండటంతో పైరవీకారులు కూడా నిర్వాసితులను ప్రలోభపెడుతన్నారు. మొదటి విడుత పరిహారం పొందిన గ్రామాల రైతులతో మెదక్ కలెక్టర్ సమక్షంలో శనివారం విచారణ జరుపడానికి నోటీసులు ఇచ్చారు.

భారత్ మాల ఫేజ్ -1లో నిర్మిస్తున్న రీజినల్ రింగ్‌రోడ్డు పట్ల గత బిఆర్ఎస్ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆరు శాతం భూసేకరణ మాత్రమే జరిగింది.

## స్థానిక ఎన్నికల్లో బిసి కోటా లేకుంటే రాష్ట్రమంతా అగ్నిగుండమే

### బిసిల అఖిలపక్ష సమావేశంలో ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరిక

### రిజర్వేషన్లు పార్టీలపరంగా అమలు నిర్ణయం క్రూరమైన పరిహాసం : సిరికొండ మధుసూదనాచారి

### బిసి రిజర్వేషన్ల అమలుకు ఇబ్బందులు సృష్టించింది ప్రభుత్వమే : వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

**హైదరాబాద్ (నాంపల్లి), నవంబరు 21, ప్రభాతవార్త :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మారుస్తామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య బిసిల అఖిలపక్ష సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం లకిడీకాపూల్‌లోని ఒక హోటల్ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సభాధ్యక్షతన ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో జరిగిన 130 బిసి కులసంఘాలు, 45 బిసి సంఘాల, ఉద్యోగ, విద్యార్థి సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో రాష్ట్ర శాసనసభ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ప్రముఖ నటుడు ఆర్.నారాయణమూర్తి, సినీదర్శకుడు శంకర్, నిర్మాత రామకృష్ణ, జాతీయ బిసి సంక్షేమ సంఘం కో-ఆర్డినేటర్ డా. ర్యాగ రిషి అరుణ్‌కుమార్ తదితరులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ చట్టబద్ధంగా బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించిన ప్రభుత్వం ఈరోజు పార్టీపరంగా ఇస్తామని మాటమార్చడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. ఈ మోసానికి భారీమూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు తన లక్ష్యమని, అన్ని బిసి సంఘాల, నాయకులను కలుపుకొని ఉద్యమాన్ని మరింత విస్తరించి బలోపేతం చేయడం, మిలిటెంట్ పోరాటమే అంతిమ లక్ష్యమని చెప్పారు. బిసి జాతి ప్రయోజనాల కోసం నేటి సమావేశంలో అందరి సూచనలను పరిగణనలోకి తీసుకుని, నిర్ణయించుకుని ముందుకుపోతామని కృష్ణయ్య తెలిపారు.



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, వకుళాభరణం, మధుసూదనాచారి, ఆర్.అరుణ్‌కుమార్, నారాయణమూర్తి, శంకర్, నీల వెంకటేష్, టి.రాజ్‌కుమార్ తదితరులు

మొదటి నుంచే అన్నివిధాలుగా ఉద్దేశపూర్వకంగా తప్పిదాలు చేస్తూ బిసి రిజర్వేషన్ల అమలుకు ఇబ్బందులు సృష్టించింది ప్రభుత్వమేనని, బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో న్యాయస్థానాల్లో వీగిపోయే విధంగా కనిపించని కుట్రలు సాగించిందని అధ్యక్షోపన్యాంలో డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఆరోపించారు. సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ బిసిల 42శాతం రిజర్వేషన్లు పార్టీలపరంగా అమలు చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ నిర్ణయం క్రూరమైన పరిహాసమని అభివర్ణించారు. రాజ్యాధికారం, సంపదలో కానీ బిసిలు వాటాదారులు కాలేకపోవడం మనం నమ్మి ఎన్నుకున్న పార్టీలు, నాయకులు ద్రోహంచేయడమేనన్నారు. నేటి రాజకీయ ఎన్నికల్లో 50కోట్లు లేకపోతే ఎమ్మెల్యే కాలేని దుస్థితిలో బిసి రాజ్యాధికారంలో వాటాదారులు కావడం కల్ల అనేది వాస్తమని గ్రహించాలన్నారు. బిసిలకు జరుగుతున్న అన్యాయాలను వింటూ భరిస్తూపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చిత్తశుద్ధి, నిబద్ధత, లక్ష్యశుద్ధిగల వారినందరినీ కలుపుకొని ఐక్యత తీసుకురావాలని సూచించారు. మన కులాలపేరుతో మనలక్ష్యానికి మనమే అవరోధమౌతున్నామని గమనించాల న్నారు. మేమెంతో మాకంత నినాదంతో ఉద్యమించాలని, ఇప్పుడు సాధించలేకపోతే జన్మలో సాధించలేమని స్పష్టం చేశారు. చివరిగా బిసిల సమైక్య శక్తి ప్రదర్శన, కఠువైన నిర్ణయాలతో బానిస శృంఖాలు తెంచుకొని ప్రభుత్వ మెడలువంచి, ముందు తరాలను బానిసత్వపు బతుకులు కాకుండా కాపాడాలని మధుసూచనా చారి సూచించారు. ఈ సమా వేశంలో బిసి నాయకులు దానకర్ణాచారి, నీల వెంకటేష్, దేవయ్య, రాజ్‌కుమార్, కుమారస్వామి, వెంకన్న గౌడ్, రాములుయాదవ్ తదితరులు పెద్దయెత్తున పాల్గొని తమ సూచనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులంతా తమ ఐక్యతను చాటుతూ అభివాదం చేశారు.

## నిఖత్ జరీన్‌కు సిఎం రేవంత్, కెటిఆర్, వెంకయ్యనాయుడు అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 21:** భారత స్టార్ బాక్సర్, తెలంగాణ తేజం నిఖత్ జరీన్ మరోసారి ప్రపంచ వేదికపై సత్తా చాటారు. గ్రేటర్ నోయిడాలో జరుగుతున్న ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో ఆమె స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. 51 కేజీల విభాగంలో అద్భుతమైన ప్రదర్శనతో విజేతగా నిలిచి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా నిఖత్‌పై రాజకీయ, క్రీడా ప్రముఖుల నుంచి ప్రశంసల వర్షం కురుస్తోంది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, నిఖత్ జరీన్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికపై మరోసారి దేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారని కొనియాడారు. నిఖత్ అసాధారణ విజయం యువతకు, వర్ధమాన క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తినిస్తుందని సీఎం పేర్కొన్నారు. ఆమె భవిష్యత్ ప్రయత్నాల్లోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు.

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఎక్స్ వేదికగా స్పందిస్తూ, భారత బాక్సర్ల అపూర్వ విజయంతో దేశం గర్విస్తోందని అన్నారు. ముఖ్యంగా, తెలంగాణ బిడ్డ అయిన నిఖత్ జరీన్ తన అద్భుతమైన పంచ్‌లతో స్వర్ణం గెలవడంపై ప్రత్యేక అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత కూడా నిఖత్‌ను ప్రశంసించారు. 'నీ కఠోర శ్రమ, అలుపెరగని పట్టుదల భారత్‌కు, తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తున్నాయి. పెద్ద కలలు కనే ఎంతో మంది యువతులకు నువ్వు స్ఫూర్తి' అని కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నిఖత్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య, బూర్గుల వెంకటేశ్వర్లు తదితరులు

## రేపు మాలల రణభేరి సభను విజయవంతం చేయాలి

### మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

**హైదరాబాద్, నవంబర్ 21, ప్రభాతవార్త:** ఈ నెల 23న హైదరాబాదు లోని సరూర్‌నగర్ స్టేడియం గ్రౌండ్ లో జరగనున్న మాలల రణభేరి మహాసభకు ప్రతి మాల తరలి రావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిఆదివారం మధ్యాహ్నం 2గంటలనుంచి సభ ప్రారంభం అవుతుందని దీనికి మాల సమాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులుహాజరవుతారన్నారు. ఎస్సీ వర్గీకరణ తో పాటు రోస్టర్ పాయింట్ల కేటాయింపును మాలల తో పాటు మరో 25 కులాలకు తీవ్ర అన్యాయం చేసేలా రూపొందించిన ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా మాలలు తరలివచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. విద్యా ఉద్యోగాలలో అవకాశాల కోసం, ఉద్యోగుల ప్రమోషన్లలో అవకాశాలు కోసం రోస్టర్ పాయింట్ల ను సవరింప చేసుకోవాలని అందుకు ప్రతి మాల సరూర్‌నగర్ స్టేడియం కు కదలి వచ్చి రణబేరి మోగించాలని చెన్నయ్య పిలుపునిచ్చారు . కొందరు మాల ద్రోహులు గుంపుగా ఏర్పడి వర్షాకాలం లో వచ్చే కప్పల మాదిరిగా ప్రతి ఎలక్షన్స్ ముందు ప్రత్యక్షమై తరువాత మాయమోతారని అలాంటి వారిని నమ్మొద్దన్నారు. మాల మహానాడు గత 30 సంవత్సరాలుగా మాలల హక్కులు, ఆత్మగౌరవం కోసమే గల్లీ నుండి డిల్లీ వరకు పోరాడుతుందని మన సమాజమంతా ఈ విషయాన్ని గమనించి, మాల సమాజ విచ్చినానికి ప్రయత్నించే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని చెన్నయ్య కోరారు. రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోస్టర్ పాయింట్లను తక్షణమే సవరించి మాలలకు న్యాయం చేయాలని, అదేవిధంగా చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయాలని సిఎంకు విజ్ఞప్తి చేశారు.

## బెట్టింగ్ యాప్‌ల గోల్‌మాల్‌పై నిధిఅగర్వాల్, అమృతాచౌదరి, శ్రీముఖిల విచారించిన సిఐడి

**హైదరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అనేక మందిని బలిగొన్న బెట్టింగ్ యాప్‌ల అక్రమాలపై రాష్ట్ర నేర పరిశోధనా విభాగం సిఐడి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేబట్టిన విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే సినీ నటులు విజయ్ దేవరకొండ, ప్రకాష్ రాజ్, దగ్గుబాటి రానా, యాంకర్ విష్ణుప్రియలను విచారించిన సిఐడి సిట్ బృందం శుక్రవారం నాడు ఇద్దరు హీరోయిన్‌లతో పాటు మరో మహి ళా యాంకర్‌ను విచారించింది. మధ్యాహ్నం రెండు గంటల సమయం లో హీరోయిన్లు నిధి అగర్వాల్, అమృతా చౌదరి, యాంకర్ శ్రీముఖిలను సి ఐడి ఆర్థిక నేరాల విభాగం నాలుగు గంటలకు పైగా విచారించింది. బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించి రాష్ట్రంలోని పంజాగుట్టతో పాటు మియాపూర్ పోలీసు స్టేషన్‌లలో సినీ తారలతో పాటు టివి నటులు, యాంకర్లపై కేసులుండడం తెలిసిందే. వీరితో పాటు యాప్‌ల యజమానులు మొత్తం 29 మందిపై కేసులు నమోదు చేయడం తెలిసిందే. కాగా కేసులు నమోదైన యాంకర్లు, నటులలో కొందరు విచా రణకు హాజరు కాగా మరికొందరు స మయం కోరారు. కాగా సిఐడి సిట్ బృందం బెట్టింగ్ యాప్‌లపై సినీ తారలతో పాటు నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచింది. దీంతో పాటు దేశ వ్యాప్తంగా సోదాలు చేబట్టిన సిఐడి కొన్ని ఆధారాలను సేకరించింది. ఈ క్రమంలో శుక్రవారం నాటి విచారణలో ముగ్గురిని విచారించిన సిట్ బృందం వారి నుంచి కీలక ఆధారాలను సేకరించింది. వీరిలో నిధి అగర్వాల్ జీత్ విన్ అనే బెట్టింగ్ సైట్‌ను ప్రమోట్ చేయగా యాంకర్ శ్రీ ముఖి ఎం88 అనే యాప్‌ను ప్రమోట్ చేసింది. అమృత చౌదరి యోలో 247, ఫెయిర్ ప్లే అనే యాప్‌లను ప్రమోట్ చేసింది. విచారణలో భాగం గా ఆయా సంస్థలతోకు దుర్చుకున్న ఆర్థిక ఒప్పందాల గురించి సిట్ అధికారులు ప్రశ్నించారని తెలిసింది. యాప్‌లకు ప్రమోషన్ చేసినందుకు ఆయా సంస్థలు ఎంత మొత్తం మీకు చెల్లించింది, ఈ చెల్లింపులు ఎలా జరిగాయి? అని సిట్ అధికారులు ముగ్గురిని ప్రశ్నించారని సమాచారం.

